
కామారెడ్డిలోని ఓ పరీక్షా కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

**రంజాన్ వేళలు**
బుధవారం
ఇఫ్తార్ : 6-33
గురువారం
సహర్ : 5-21

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు షురూ

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షల నిర్వహణ
- నిజామాబాద్‌లో 57, కామారెడ్డిలో 38 కేంద్రాల ఏర్పాటు
- ఎగ్జామ్ సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు

కామారెడ్డి/ ఖలీల్‌వాడి, మార్చి 4 : ఉమ్మడి జిల్లాలో నేటి నుంచి ఈ నెల 25 వరకు ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి దాదాపు 55 వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. కామారెడ్డిలో 38, నిజామాబాద్‌లో 57 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగనున్నాయి. అరగంట ముందు విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించనున్నారు. ఉదయం 8.30 గంటల్లో పరీక్షా కేంద్రంలో ఉండాలి. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 18,469 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరానికి 8,743 మంది, ద్వితీయ సంవత్సరానికి 9,726 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఒకేషనల్ మొదటి సంవత్సరం 1,915, ద్వితీయ సంవత్సరం 1,390 మొత్తం 3,305 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. నిజామాబాద్ జిల్లాలో 36, 222 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో జనరల్ 15053 మంది కాగా, ఒకేషనల్ 2,736 మంది విద్యార్థులు ఉన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 17, 789 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. ద్వితీయ సంవత్సరం 13, 944 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో ప్రైవేట్ 2,128 మంది , ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ 2042 మంది, ప్రైవేట్ 319 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని అధికారులు ఇప్పటికే సూచించారు.

**పలు కేంద్రాల్లో సౌకర్యాలు కరువు**

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పా ట్లు, సౌకర్యాలు కల్పించినట్లు ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అవే మీ కనిపించడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. కామారెడ్డి పట్టణంలోని ప్రైవేట్ కళాశాల్లో సీసీ కెమెరాలు, ఫ్యాన్లు ఉన్నప్పటికీ పలు మండలాల్లో అవి ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.




## కేసీఆర్ హయాంలోనే సాగు బాగు

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఒక్కసారి కూడా సాగునీటి ఇబ్బందులు తలెత్తలేదని రైతులు గుర్తుచేసుకుంటున్నారు. 'కాళేశ్వరం'తో ప్రాజెక్టుల ద్వారా సాగునీటిని అందించి రైతులకు కష్టాలను దూరం చేశారని కొనియాడుతున్నారు. నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల ద్వారా లక్షల ఎకరాలకు నీటిని అందించి, వ్యవసాయాన్ని పండుగలా మార్చారన్నారు. పదేండ్ల కాలంలో విద్యుత్, ఎరువులు, పెట్టుబడి సాయం సకాలంలో అందించేవారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎరువులు, పెట్టుబడి సాయం అటుంచితే, పంటలకు నీళ్లను అందించలేని పరిస్థితి దాపురించిందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

# సాగు నీటి కష్టాలు

- ఎండిపోతున్న పంట పొలాలు
- తగ్గుముఖం పడుతున్న భూగర్భ జలాలు
- మైదానాల్లా మారుతున్నచెరువులు,కుంటలు
- వట్టిపోతున్న బోర్లు.. ఆందోళనలో రైతులు

***యాసంగి సీజన్‌లో*** *వరి పంట చేతికి వచ్చే సమయంలో రైతులకు సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. సాగునీరు అందక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వేసవికి ముందే బోర్లు ఎత్తిపోతుండడంతో నీరందక పంటలు ఎండిపోతున్నాయి. ముఖ్యంగా జిల్లాలో ఆయకట్టు శివారుల్లోని భూములకు సాగునీరు అందక రైతులు అల్లాడిపోతున్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. సాగునీరు అందించడానికి ముందస్తు ప్రణాళికలు రూపొందించడంలో ప్రభుత్వ వైఫల్యం రైతులకు శాపంగా మారింది. పలుగ్రామాల్లో చెరువులు ఎండిపోయి మైదానాలను తలపిస్తున్నాయి. ప్రభుత్వం ఒకవైపు రైతుభరోసా ఇవ్వకపోవడం, మరోవైపు సాగునీటి ఇబ్బందులను తీర్చకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.*

*-ఖలీల్‌వాడి, మార్చి 3*

**అద్దెకు ట్యాంకర్లు.. పంటలకు నీళ్లు**

మోపాల్ మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయి. నీటి వనరులు తగ్గిపోతుండడం, పంటలు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పంటను కాపాడుకునేందుకు చివరి ప్రయత్నంగా ట్యాంకర్ల ద్వారా నీళ్లను అందిస్తున్నారు. గత నెలాఖరులోనే బోరుబావులు ఎండిపోవడంతో అప్పులు చేసి ట్యాంకర్లను అద్దెకు మాట్లాడుకున్నారు. రోజువారి అద్దె చొప్పున పంటలకు నీరందిస్తున్నారు. ఇలాంటి దుర్భర పరిస్థితి 12 ఏండ్ల క్రితం వచ్చిందంటే మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చూస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకులు నోరు మెదకపోవడం గమనార్హం.

## బోరు నీరు ఆగుకుంట వస్తున్నది



ఎనిమిదెకరాల్లో పంట పండిస్తున్నాం. బోరు నీరు ఆగుకుంటా వస్తున్నది.ఇంకో 15 రోజులు అయి తే అది కూడా రాదు. ఇలా ఉంటే పంట సగానికి పైగా నష్టపోయే అవకాశం ఉన్నది. నిజామాబాద్ అంతతా ఇదే పరిస్థితి నెలకొన్నది.

**-గంగారెడ్డి, రైతు, బాడ్సి**

## ఇప్పటికే పంట నష్టపోయిన



నాకు ఉన్న ఆరు ఎకరాల్లో పంట సాగుచేస్తున్న. నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నం. ఇప్పటివరకూ రెండు బోర్లు వేసినా ఫలితం లేకుండా పోయింది. నీళ్లు లేక పంట ఎండిపోయింది. ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వ మమ్మల్ని ఆదుకోవాలి.

**-ముత్యంరెడ్డి, రైతు, సిర్పూర్, మోపాల్ మండలం**

## చాలా ఇబ్బందులు పడుతున్నం..



మండలంలో ఎక్కడ చూసినా చెరువులు ఎండిపోతున్నాయి. కొన్ని గ్రామాల్లో మైదానాలను తలపిస్తున్నాయి. పంటలకు నీళ్లందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నం. బోర్లు ఆగుకుంట పోస్తున్నయి. రానున్న రోజుల్లో బోర్లు వట్టిపోయే పరిస్థితి నెలకొన్నది. పంటలు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉన్నది.

**-కంజర భూమయ్య, రైతు, కంజర గ్రామం**



ఎండిపోయిన ముదక్‌పల్లి చెరువు


యజమాని ఇంటి ఎదుట బైఠాయించిన మున్సిపల్ అధికారులు

# మొండి బకాయిల కోసం..

***మొండి పన్నుల వసూలులో*** *మున్సిపల్ అధికారులు 'మొండి'గా వ్యవహరిస్తున్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలో మున్సిపల్ అధికారులు ఆస్తి పన్ను వసూలు కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని 25వ వార్డులో ఓ ఇంటి యజమాని నాలుగేండ్లుగా ఇంటి పన్ను చెల్లించడంలేదు. దీంతో మున్సిపల్ అధికారులు మంగళవారం సదరు యజమాని ఇంటి ఎదుట బైఠాయించారు.*

*-ఆర్మూర్‌టౌన్, మార్చి 4*

# ల్యాబ్ గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలి

**నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**

మోర్తాడ్/మెండోరా, మార్చి4 : మెండోరా మండలంలోని పోచంపాడ్‌లో గురుకుల పాఠశాల, కళాశాల, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గురుకుల పాఠశాలలో అర్ధాంతరంగా నిలిచిపోయిన ల్యాబ్ గదుల నిర్మాణాలను పూర్తి చేయించేందుకు తక్షణమే ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కిచెన్‌కమ్ డైనింగ్ హాల్, స్టోర్‌రూంలను సందర్శించి బియ్యం, కూరగాయలు, పప్పు దినుసులు, వంటనూనె, ఇతర సరుకులను పరిశీలించారు. సరుకుల స్టాక్ రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణను పరిశీలించి ప్లేగ్రౌండ్ గురించి ఆరాతీశారు. కిచెన్‌లో నిరుపయోగంగా ఉన్న స్టీమ్ యూనిట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఐదవందల మందికిపైచిలుకు విద్యార్థులు ఉన్నందున శుచి, శుభ్రతతో భోజనాలు వండాలని సూచించారు. అనంతరం పోచంపాడ్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆయా విభాగాలను సందర్శించారు. రోగులకు అందిస్తున్న సేవల తీరును అడిగి తెలుసుకున్నారు. వైద్యు లు, సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న మందుల స్టాక్‌ను పరిశీలించారు. వివిధ వార్డులను సందర్శించి రోగులకు కల్పిస్తున్న సదుపాయాలను గమనించారు. దీర్ఘకాలిక వ్యాధులు, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధుల నిర్ధారణ, అందిస్తున చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యులకు సూచించారు. కలెక్టర్ వెంట జోనల్ ఆఫీసర్ పూర్ణచందర్, స్కూల్ ప్రిన్సిపాల్ గోదావరి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేశ్ తదితరులు ఉన్నారు.


మెండోరా బాలికల గురుకులంలో సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

**నమస్తే తెలంగాణ ఎఫెక్ట్**

# చివరి ఆయకట్టుకు నీటి సరఫరా

కోటగిరి, మార్చి 4: నిజాంసాగర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టుకు నీరు అందక పొట్ట దశలో ఉన్న వరి పంట ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల సాగునీటి ఇబ్బందులపై నమస్తే తెలంగాణ దినపత్రికలో 'అందని నీళ్లు.. ఆగని కన్నీళ్లు' శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు స్పందించారు. మంగళవారం ఉదయమే ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణతోపాటు సిబ్బంది నిజాంసాగర్ కాలువ నీటిని పర్యవేక్షణ చేస్తూ కొల్లూర్ గ్రామ శివారులోని చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చర్యలు తీసుకున్నారు. ఎండిపోయే దశలో ఉన్న బర్ల గంగరాం, బర్ల నాగేశ్ పంట పొలాలకు నీరు అందేలా పర్యవేక్షించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.


కొల్లూర్ శివారులో పంటలోకి చేరిన నీరు

# పరీక్షల కాలంలో ఒత్తిడికి గురికావొద్దు

**ప్రణాళికతో చదివి ఉత్తమ మార్కులు సాధించాలి**

**జిల్లా జడ్జి సునీత కుంచాల**

ఎడపల్లి, మార్చి 4 : విద్యార్థులు పరీక్షల కాలంలో ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికతో చదివి ఉత్తమ మార్కులు సాధించాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. బోధన్‌కు చెందిన రిటైర్ట్ టీచర్ సరోజమ్మ తన సొంత డబ్బులతో శానిటరీ నాప్కిన్ వెండింగ్ మిషన్లు సమకూర్చగా..మండల కేంద్ర శివారులో ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జి హాజరై తొమ్మిది ప్రభుత్వ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లకు శానిటరీ నాప్కిన్ వెండింగ్ మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. విద్యార్థులు ఓ లక్ష్యాన్ని ఏర్పర్చుకొని జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని సూచించారు. జీవితంలో విజయం సాధించినప్పుడే పిల్లలు తల్లిదండ్రులకు ఇచ్చే గొప్ప బహుమానం అదే అని పేర్కొన్నారు. 18 ఏండ్లు నిండిన వారికి డ్రైవింగ్ వచ్చి ఉంటే తప్పనిసరిగా లైసెన్సు పొంది ఉండాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపి పట్టుబడితే వారి తల్లిదండ్రులకు మూడేండ్లు జైలు శిక్ష, రూ. 25 వేల జరిమానా విధిస్తారని తెలిపారు. శానిటరీ నాప్కిన్ వెండింగ్ మిషన్లను అందజేసిన రిటైర్డ్ టీచర్ సరోజమ్మను అభినందించారు. కార్యక్రమంలో బోధన్ కోర్టు జడ్జి సాయిశివ, సివిల్ జూనియర్ జడ్జి పూజిత, గురుకుల ప్రిన్సిపాల్ గంగా శంకర్, బోధన్ రూరల్ సీఐ విజయబాబు, ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణా రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల


మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
PRESENT




లక్షల మందిని చేరుకునే సలక్షణ వేదిక

అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న నిజామాబాద్ మరియు పరిసర ప్రాంతాల్లోని అన్ని ప్రముఖ సంస్థల ప్రాపర్టీలు, హైదరాబాద్‌లోని ప్రఖ్యాత రియాల్టీ ప్రాపర్టీలు ఒకే వేదికపైన మరియు తక్షణ రుణ సదుపాయం కొరకు ప్రముఖ జాతీయ బ్యాంకులు కూడా అదే వేదికపై అందుబాటులో ఉంటాయి.

08 - 09, మార్చి 2025

వేదిక: వేణు మాల్ (హోటల్ నిఖిల్ సాయి)

దేవి థియేటర్ క్రాస్ రోడ్డు, హైదరాబాద్ రోడ్డు, నిజామాబాద్

Digital Partner: S TV | TV Sponcer: T NEWS

Main Sponsor: VASAVI GROUP — You dream. We deliver.

Co-Sponsor: SVC

In Association With: SRI ASHOKA BUILDERS & DEVELOPERS, AISHWARYAM HOMES, ROYALOAK, APR, ANKURAM, BHOOMI SPACE, ADURI GROUP, SUNYUGA INFRA PVT. LTD., DIVINE, TMR GROUP, SHRI SLN PROPERTIES, AKSHAYA ENTERPRISES, Sri Govinda Sai Builders & Developers

Booking Enquiry: Nizamabad - 9182777399, 9182777590